క్లుప్తంగా

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ

పిట్టలవానిపాలెం: మహిళా సాధికారతకు కృషి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆమె మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మహిళా సాధికారతను చేతల్లో చేసి చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ఇంటి నివేశన స్థల పట్టాతో పాటు అనేక ప్రభుత్వ పథకాలను మహిళలకే అందేలా చేశారని చెప్పారు. ప్రస్తుతం మహిళలు చాలా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

ఐలవరంలో ఉచిత వైద్య శిబిరం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో మంగళవారం సేవా భారతి ఆధ్వర్యంలో అశ్విని సంచార వైద్యశాల, మండవ ఫౌండేషన్, ఎస్‌పీ స్ఎల్ టెక్స్‌టైల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులు వైద్య పరీక్షలు చేశారు. మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గద్దం రామకోటేశ్వరరావు, సాయి, గ్రామస్తులు జంజనం హేమశంకరరావు, వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



రేపల్లె: సమస్యల పరిష్కారానికి నిరంతరం సీఐటీయూ ఉద్యమాలు చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పేర్కొన్నారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 1970 మే 30న కలకత్తాలో సీఐటీయూ ఆవిర్భవించిందని తెలిపారు. నాటి నుంచి కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు, నాయకులు కె.ఆశీర్వాదం, వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, నవీన్ తదితరాలు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



రేపల్లె: బాలల మేధా శక్తిని పెంపొందించేందుకే సమ్మర్ క్యాంప్ నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక సభ్యుడు కె.సాయిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 23వ వార్డు బాల్ బహుదూర్ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, బాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పెషల్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్యాంపులో 4 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, యుటీఎఫ్ నాయకులు ఎంవీ సుబ్బారావు, ఐద్వా నాయకులు అనురాధ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



భట్టిప్రోలు: వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్–3లో భాగంగా భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని విఠలేశ్వరనగర్ రామ మందిరం వద్ద మంగళవారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పారా మెడికల్ అప్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంవోఏ) పెనుమాల అరుణరాణి పరీక్షలు చేశారు. 60 మందిని పరీక్షించగా 22 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, ముగ్గురిని రిఫరల్‌కు పంపడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.మాతయ్య, ఎంపీహెచ్ఏ అనగాని తిరుమలరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు నందం లీలాకుమారి, గాదల్లి నిర్మలాకుమారి, ఆదిన వరలక్ష్మి, మద్దుల లక్ష్మి, అంక సరస్వతీ, శ్రీరాముల వెంకట రమణ, పి.కలిమి లారాణి పాల్గొని వైద్య సేవలు అందించారు.

సమకాలీనం..సందేశాత్మకం

- పల్లెకోనలో ఆద్యంతం కట్టిపడేస్తున్న నాటక ప్రదర్శనలు
- నేటితో ముగియనున్న అఖిల భారత నాటక పోటీలు
- సందేశాత్మకంగా కొనసాగుతున్న నాటకోత్సవాలు



ఇంద్రప్రస్థం నాటకంలోని ఓ సన్నివేశం



ప్రదర్శనలు తిలకిస్తున్న సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, న్యాయనిర్ణేతలు

పల్లెకోన(భట్టిప్రోలు): పల్లెకోనలో ప్రదర్శింపబడుతున్న.. నాటక పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నందమూరి తారకరామావు కళా ప్రాంగణం, పరుచూరి రఘుబాబు, టి.సుబ్బిరామిరెడ్డి లలిత కళా పరిషత్ మండపం ప్రేక్షకులతో నిండిపోయింది. పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ డి.రామానాయుడు 31వ అఖిల భారత ఆహ్వాన నాటక పోటీల్లో మంగళవారం రెండు నాటకాలు ప్రదర్శితమయ్యాయి. సినీ రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ నాటక పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. సమాజాన్ని చైతన్య పరచేలా, నేటి కాలానుగుణ కథలతో కళాకారుల నాటక ప్రదర్శనలు ఆద్యంతం కట్టిపడేశాయి. తొలుత పరుచూరి రఘుబాబు, పరుచూరి సోదరుల తల్లిదండ్రులు, సోదరుడు చిత్రపటాలకు పరుచూరి వెంకటేశ్వరరావు పూలమాలు వేసి, నివాళులర్పించారు. నాటకోత్సవ సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. వ్యాఖ్యాతగా డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి వీవీ రాజగోపాల్, పద్మావతి, వేజండ్ల బసవ పున్నారావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమకాలీన పరిస్థితులకు దర్పణం 'సిరి మింగిన వెలగ పండు'

ప్రజాస్వామ్యం.. రాజకీయం, పరిపాలన, న్యాయ స్థానాలు, జర్నలిజం అనే నాలుగు వ్యవస్థల మీద నిలబడి ఉండాలి. నేడు ఆ నాలుగు డబ్బుకు లొంగి.. మొత్తం ప్రజాస్వామ్యాన్నే వెలగ పండులా మార్చేసాయి. ఏనుగు తినేసిన వెలగ పండు పైకి బాగానే కనిపిస్తుంది. కానీ విప్పి చూస్తే అంతా డొల్ల. ఈ ప్రస్తుత పరిస్థితులకు దర్పణమే 'సిరి మింగిన వెలగ పండు నాటక సారాంశం.' విద్యా నగర్ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారు సమర్పించిన ఈ నాటకానికి రచన వి. శ్రీశైల మూర్తి, దర్శకత్వం మోహన్ సేనాపతి వహించారు.

నాన్న ఔదార్యాన్ని చాటిన 'ఇంద్ర ప్రస్థం'

జీవితం గొప్పగా ఎదగాలన్నా... జీవన విధానం మరింత అందంగా కొనసాగిపోవాలన్నా...చేదోడు, చేయూత ఎంతో అవసరం. ఈ సృష్టిలో ప్రతి మనిషి జీవితానికి, నడక, నడత, నడవడిక నేర్పి తన అనుభవాలను పాఠాలుగా బోధించి, మంచి భవిష్యత్తును ఇవ్వగలిగేది ఒక్క నాన్న మాత్రమే. అందుకే నాన్న గొప్ప వ్యక్తే కాదు, అమృతమూర్తి కూడా. ఇలా తనదైన శైలిలో తన కథను తానే గొప్పగా నిర్మించుకున్న నాన్న కథ ఇది. నాన్న ఉన్న ఇల్లు అద్భుతమైన ఇంద్ర ప్రస్థంలా వెలుగులు వెదజల్లుతుందని తెలియచెప్పేదే ఈ నాటకం సారాంశం. అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకానికి రచన స్నిగ్ధ, దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి వహించారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం 9 గంటలకు ఆంధ్ర హాస్పిటల్ విజయవాడ వారిచే హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ ఉచితంగా నిర్వహించనున్నారు.

- సాయంత్రం 6:30 గంటలకు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు వారి ''కలనేత'' ప్రదర్శించనున్నారు. రచన ఆకెళ్ళ, దర్శకత్వం బీఎం రెడ్డి,
- రాత్రి 8:30 గంటలకు ప్రముఖ నటీమణి ఎ.విజయలక్ష్మి (విజయవాడ)కి పరుచూరి విజయలక్ష్మి స్మారక జీవితకాల పురస్కారం కింద రూ. 25 వేలు నగదు, జ్ఞాపిక అందజేయనున్నారు. నాటక పోటీల విజేతలకు ప్రముఖ సినీ దర్శకులు ఎస్.శంకర్ బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున

చినపరిమి(వేమూరు): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చుండూరు మండలం చినపరిమి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును తెలుసుకున్నారు. లబ్ధిదారులకు పథకాలను వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే సంబంధిత అధికారులను ప్రశ్నించడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రి నాగార్జున పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎన్నికల హామీలన్నింటినీ జగనన్న అమలు చేశారని గుర్తుచేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, చందోలు డేవిడ్ విజయకుమార్, గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణీ, ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, పార్టీ మండలాధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి, అవుతు సాయిబాబురెడ్డి, తమ్మా బసివిరెడ్డి, తమ్మా పాములురెడ్డి, అవుతు శివపార్వతీరెడ్డి, పమిడి కొండల రాజేష్‌కుమార్, ఉయ్యూరి అంజిరెడ్డి, పులివర్తి మోషే, అళ్ల సత్యనారాయణ రెడ్డి, ఉయ్యూరి అప్పిరెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, కుదేటి కృష్ణ మోహన్‌రెడ్డి, ఉయ్యూరి భాస్కర్ రెడ్డి, మర్రిరెడ్డి బసివిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం..

వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరుగుతుందని పార్టీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్ర దశ, దిశ మార్చిన ఘనత జగనన్నదే



రేపల్లె పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీ మోపిదేవి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ప్రజల సంక్షేమానికి పాటుపడుతూ రాష్ట్ర దశ, దిశను మార్చి వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి, నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాల పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. దీంతో ప్రతి ఇంటి ముంగిట పండుగ వాతావరణం నెలకొందన్నారు. వివిధ రంగాల్లోనూ అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఎంపీ చెప్పారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ సమన్యాయం జరిగేలా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమం బాటలో పయనిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ స్థాయిలో ఆదర్శప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. తొలుత పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, బస్టాండ్ సెంటరు వరకు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటరు నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ మున్సిపల్ ఆఫీసు రోడ్డు మీదగా ఓల్డ్‌టౌన్ చేరుకుంది. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: దాడి ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు వివరాలిలా మేరకు.. తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన జి.రవి అనే వ్యక్తి.. అదే గ్రామానికి చెందిన సాలవ సురేంద్ర వద్ద గతంలో కొంత మొత్తం అప్పుగా తీసుకున్నాడు. బాకీ విషయమై రవితో ఘర్షణ పడిన సురేంద్ర అతనిపై తన స్నేహితులు ప్రభు, ప్రవీణ్‌లతో కలసి ఇటీవల దాడి చేశాడు. అంతటితో ఆగకుండా తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లి అక్కడా దాడి చేస్తూ వీడియో తీశారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచినట్టు ఎస్ఐ తెలిపారు.

మజ్జిగ పంపిణీ



తెనాలి: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి బస్ షెల్టర్‌లో నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో మంగళవారం రెడ్‌క్రాస్ తెనాలి శాఖ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి మజ్జిగ పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ మూర్తి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



ఎంపీ మోపిదేవికి విన్నవిస్తున్న భవన నిర్మాణ కమిటీ సభ్యులు

రేపల్లె రూరల్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆదేశించారు. అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీని కలిసి, నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని విన్నవించారు. రూ.1.25కోట్లతో భవనం నిర్మాణం జరుగుతోందని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీ కాంట్రాక్టర్‌ను కోరారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కర్లపాలెం: వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపీనాథ్ పేర్కొన్నారు. నాగరాజుపాలెంలో మంగళవారం 104 వాహన సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 58మందికి డాక్టర్ గోపీనాథ్ వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఎండలు అధికంగా ఉన్నప్పుడు ప్రయాణం చేయవద్దని సూచించారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచి, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఇవ్వాలని సూచించారు. అవసరం మేరకు డాక్టర్ వద్దకు తీసుకెళ్లి.. వైద్యం చేయించాలని చెప్పారు. మధుమేహం, రక్తపోటు ఉన్న వారు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకుని, సక్రమంగా మందులు వాడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం శివనాగమణి, ఎంపీహెచ్‌ఏ జాషువా, నాగరాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

పరస్పర కేసులు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనలో ఇరువర్గాలపై పరస్పర కేసులు నమోదయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఓ వైద్యుడికి, అతని భార్యకు కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. ఈ విషయమై వైద్యుడు, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు విజయవాడ నుంచి ఇద్దరు న్యాయవాదులు మంగళవారం తెనాలి వచ్చారు. వైద్యుని సోదరుడితో మాట్లాడే క్రమంలో ఘర్షణ జరగడంతో పరస్పర దాడికి పాల్పడ్డారు. రెండు వర్గాల ఫిర్యాదుల మేరకు.. కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

కనుల పండువగా పోలేరమ్మ తిరునాళ్ల

- ప్రత్యేక ఆకర్షణగా ప్రభలు
- పొంగళ్లు పొంగించి, మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన పోలేరమ్మ

బాపట్లటౌన్: కనకాద్రి నగర్ గ్రామంలో వెంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయం తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై అమ్మవారి ప్రభలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పశుపోషకులు తమ పశు సంపదను చల్లగా చూడు తల్లి.. అంటూ ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేశారు. భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చింతామణి నాటకం, ఆదివాసుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తిరునాళ్ల సందర్భంగా ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పమిడిబోయిన వెంకటేశ్వర్లు భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. తొమ్మిదేళ్లుగా అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేసినట్లు వెల్లడించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జేవీఎస్ఆర్ కేవీ ప్రసాద్



కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ ప్రసాద్

భట్టిప్రోలు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తోందని బాపట్ల జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జేవీఎస్ఆర్ కేవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను ఆయన సందర్శించారు. కాలనీలో నీటి సదుపాయం కల్పించినప్పటికీ.. సరఫరా సరిగ్గా ఉండటం లేదని లబ్ధిదారులు పీడీకి వివరించారు. గృహ నిర్మాణ సామగ్రి తెచ్చుకునేందుకు అంతర్గత దారులు సరిగా లేవని, ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అంతర్గత రోడ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి, కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని పీడీ సమాధానం ఇచ్చారు. కాలనీలో సమస్యలను విడతల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తొలుత స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులందరూ గృహాలు నిర్మించుకునేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి పని చేయాలని, లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రావూరి సౌమ్య, శేతు రామచంద్రరావు, శివకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బరువులెత్తే క్రీడలో మరో పేదింటి కుసుమం

- తెలంగాణలో జరిగిన జాతీయ పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో 'రజతం' సాధించిన వక్కలగడ్డ రేవతి
- రూ.50 వేల ఆర్థికసాయం అందజేసిన తెనాలిలోని శ్రీషిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్



రేవతికి చెక్కును అందజేస్తున్న లక్ష్మణ్‌బాబు

తెనాలి: బరువులెత్తే క్రీడలో పేదింటి యువతులు సత్తా చాటుతున్నారు.పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాల్ని సాధిస్తున్నారు. ఆ కోవలో ఇప్పుడు మరో ఆణి ముత్యం వెలుగులోకి వచ్చింది. ఆమె వక్కలగడ్డ రేవతి. తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగిన 2వ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకంతో విజయహాసం చేసింది. మహిళల 76 కిలోల విభాగంలో 82 కిలోల బరువులనెత్తి రజత పతకం సాధించటం విశేషం. డిగ్రీ సెకండియర్ చదువుతున్న రేవతి, రూరల్ మండలం కఠెవరంలో మాజీ వెయిట్ లిఫ్టర్ల ఆధ్వర్యంలో నడుస్తున్న కోచింగ్ సెంటరులో సాధన చేస్తోంది. నందివెలుగులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయినిగా చేస్తున్న కొల్లిపర నాగశిరీష శిష్యరికంలో సాధన కొనసాగిస్తున్న రేవతి తండ్రి స్థానిక వైకుంఠపురం దేవస్థానంలో చిరుద్యోగి. తండ్రి ప్రోత్సాహంతో అటు చదువుకుంటూనే బరువులెత్తే క్రీడకు అంకితమైంది. ఆ క్రమంలోనే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఏకంగా జాతీయ పోటీల్లో రజతంతో మెరిసింది. ఆమె పడుతున్న కష్టం, వెయిట్‌లిఫ్టింగ్ ప్రదర్శిస్తున్న ప్రతిభకు తన వంతు ప్రోత్సాహంగా, స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ సాయినగర్‌లో గల శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయానికి చెందిన శ్రీషిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కె.లక్ష్మణ్‌బాబు మంగళవారం సాయి సన్నిధిలో రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాల్ని సాధించి, క్రీడా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెనాలికి గల ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. తనకు ఆర్థికంగా సహకరిస్తున్న లక్ష్మణ్‌బాబు సహకారంతో అంతర్జాతీయ స్థాయి విజయాల్ని సాధించగలనన్న విశ్వాసంతో ఉన్నట్టు రేవతి చెప్పారు. కార్యక్రమంలో కోచ్ కొల్లిపర నాగశిరీష, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య, మూకిరి సుజాత, జంధ్యాల రాజేశ్వరరావు, చింతలపాటి సీతారామశాస్త్రి, పాలేరు భార్గవరావు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి కొత్తపేటలో పేకాట స్థావరంపై ఎస్ఈబీ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి కార్యాలయంలో అధికారులు వివరాలు వెల్లడించారు. స్థానిక అమరావతి లాడ్జిలో జరిపిన దాడుల్లో 13 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 2,83,580లు స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంథొని రాజ్, డీఎస్ఈఓ బృందం ఇన్‌స్పెక్టర్ టి.పెదనారాయణ స్వామి, ఎస్ఐ ఆరిఫ్, తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.



